క్లుప్తంగా

చిరుధాన్యాల ప్రయోజనాలపై అవగాహన

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని పెద మేరంగి గ్రామంలో రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం వారి గృహ విజ్ఞాన విభాగం పరిశీలనలో చిరుధాన్యాల ప్రయోజనాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త ఉమాజ్యోతి మాట్లాడుతూ చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతిఒక్కరూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని ఆమె తెలిపారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయించొద్దు

గరుగుబిల్లి: అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ షేక్ ఫక్రుద్దీన్ ఓ ప్రకటనలో శుక్రవారం హెచ్చరించారు. ఇప్పటికే అక్రమంగా గ్రామీణ ప్రాంతాల్లో జరిగే బాణసంచా విక్రయాలపై నిఘా పెట్టామన్నారు. ఎక్కడైనా నిబంధనలు అతిక్రమిస్తూ బాణసంచా తయారు చేసినా తరలించినా విక్రయించిన కేసులు తప్పవన్నారు.

ఆరోగ్య కార్యకర్తలను నియమించాలి

సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని ప్రతీ ఆశ్రమ పాఠశాల, వసతిగృహాల్లో ఆరోగ్య సిబ్బందిని నియమించాలని ఆదివాసీ జేఏసీ, ఆరోగ్య కార్యకర్తల సంఘ అధ్యక్షుడు బి.రామ్మోహన రావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గిరిజన పాఠశాలలకు చెందిన ఆరుగురు విద్యార్థులు మృతి చెందడం బాధాకరమన్నారు. విద్యార్థులకు వైద్యసేవలు అందించేందుకు సిబ్బందిని నియమించాలని కోరారు.

వితరణ



నిర్వాహకులకు చెక్ అందిస్తున్న దాతలు

పాలకొండ రూరల్: పట్టణంలోని సత్యసాయి సేవా సమితి ద్వారా అన్నార్తులకు అందిస్తున్న నిత్య నారాయణ సేవకు శిల్లా సూర్యనారాయణ గుప్త జ్ఞాపకార్థం ఆయన సతీమణి రాజకుమారి రూ.లక్ష వితరణగా అందించారు. శుక్రవారం స్థానిక సాయి మందిరానికి చేరుకుని ఈ మొత్తాన్ని చెక్ రూపంలో సమితి కన్వీనర్ యు.ప్రభాకరరావుకు అందజేశారు. కార్యక్రమంలో దాత కుమారుడు శిల్లా మనోహర్‌తో పాటు సమితి నిర్వాహకులు రమేష్ సాహూ, కనకం వెంకటరమణ, కిల్లారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లైటింగ్ ప్రారంభం



కొత్తగా ఏర్పాటు చేసిన ఐ లవ్ వీరఘట్టం అక్షరమాల

వీరఘట్టం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో వీరఘట్టం ప్రధాన రహదారిని రూ.5.50 కోట్లతో విస్తరించి అభివృద్ధి చేసిన విషయం అందరికి తెలిసిందే. ప్రస్తుతం ఈ ప్రధాన రహదారిలో ఇటీవల సుడా ఆధ్వర్యంలో రూ.26.5 లక్షల వ్యయంతో సెంట్రల్ లైటింగ్, ఐ లవ్ వీరఘట్టం అక్షరమాలను ఏర్పాటు చేశారు. ఈ సెంట్రల్ లైటింగ్‌ను సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శుక్రవారం రాత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు జామి లక్ష్మీనారాయణ, జంపు శేఖర్, బల్లా హరిబాబు, పి.కృష్ణమూర్తినాయుడు, ఉదయాన ఉదయ్, చింత ఉమ, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

సీతంపేట/భామిని: రేషన్ కార్డుదారులకు స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్మార్ట్ రేషన్ కార్డులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సీతంపేట, భామిని మండల కేంద్రాల్లో ఆయన మాట్లాడుతూ.. ఈ కార్డుల వల్ల లబ్ధిదారులు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చన్నారు. కార్యక్రమాల్లో సీతంపేట సర్పంచ్ ఎ. కళావతి, తహసీల్దార్ డి.శ్రీకన్య, ఆర్ఐ విజయ్‌కుమార్, జీసీసీ మేనేజర్ డి.కృష్ణ, ఏఎంసీ చైర్‌పర్సన్ సంధ్యారాణి, భామిని తహసీల్దార్ శివన్నారాయణ పాల్గొన్నారు.

అవగాహన

పాలకొండ రూరల్: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికల రక్షణ కోసం రూపొందించిన చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శక్తిటీమ్ ఏఎస్సై ఝాన్సీబాయి మాట్లాడుతూ.. బాలికలకు ఏ సమస్య ఎదురైనా 112కు ఫోన్ చేయాలని సూచించారు. అలాగే మాదకద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.



అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై ఝాన్సీబాయి

టపాసులతో జాగ్రత్త!

- దీపావళి పండగలో అప్రమత్తంగా ఉండాలి
- బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలి
- శబ్ద, వాయు కాలుష్యం బారినపడొద్దు..



దీపావళి బాణసంచా

గుమ్మలక్ష్మీపురం: చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకునే దీపావళి పండగ రానే వస్తోంది. అయితే ఈ వెలుగుల ఉత్సవంలో అప్రమత్తంగా లేకుంటే ప్రమాదం కొని తెచ్చుకునే అవకాశం బోలెడు ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నెల 20వ తేదీన దీపావళి కావడంతో అందరూ బాణసంచా కొనుగోళ్లకు ఉత్సాహం కనబరుస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు టపాసులు కాల్చేందుకు ఇష్టపడతారు. ఈ నేపథ్యంలో పండగ పూట విషాదం చోటుచేసుకోకుండగా ఆనందంగా పండగ జరుపుకోవాలని సూచిస్తున్నారు. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఎటువంటి నష్టముండదని సలహా ఇస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలివే..

- గ్రామీణ ప్రాంతాల్లో పంటపొలాలు, గడ్డివాములు, పూరిగుడిసెలు అధికంగా ఉంటాయి..అటువంటి ప్రాంతాల్లో రాకెట్లు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు వంటి బాణసంచా కాల్చరాదు
- టపాకాయల పనితీరు, వెలిగించాల్సిన విధానాన్ని అర్థమయ్యేలా తెలియజేయాలి
- పెద్దల పర్యవేక్షణలోనే పిల్లలు టపాసులు కాల్చాలి
- రోడ్లుపై భారీ టపాకాయలు కాల్చేటప్పుడు వాహనదారులు వస్తున్నదీ లేనిదీ చూసుకోవాలి
- వ్యాపారులు అనుసరించాల్సిన నియమాలు..
- జనసంచారం లేని, ఊరికి దూరంగా ఉండే ప్రాంతాల్లో దుకాణ సముదాయాలు ఏర్పాటు చేయాలి
- అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని నివారించే పరిస్థితులు కల్పించేలా చర్యలు ఉండాలి
- టపాకాయలు అమ్మే వారంతా పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారుల అనుమతులు తీసుకోవాలి
- బాణసంచా విక్రయ ప్రాంతంలో విధిగా ఇసుక, నీరు, కార్బన్‌డయాక్సైడ్ వాయువును అందుబాటులో ఉంచాలి
- దుకాణాల సమీపంలో ఎవరూ సిగరెట్లు, బీడీలు కాల్చకుండా ఉండేలా పొగ తాగరాదు అనే బోర్డులు ఏర్పాటు చేయాలి
- దుకాణాల మధ్య కనీసం 10 అడుగుల దూరం ఉండాలి
- మందుగుండు సామగ్రి విక్రయ కేంద్రాల్లో విద్యుత్‌కు సంబంధించిన వైరింగ్ సక్రమంగా ఉండేలా చూడాలి
- అధికారుల తనిఖీల సమయంలో మందుగుండు సామగ్రి వివరాలు తెలిపే వివరాలు అందుబాటులో ఉంచాలి
- ప్రతి షాపు వద్ద టపాకాయల ధరల పట్టిక, అగ్నిమాపక కేంద్రాల ఫోన్ నంబర్లు ఉంచాలి

అనుమతులు తప్పనిసరి..



బాణసంచా విక్రయాలు, తయారీకి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. ఎక్కడైనా ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తూ బాణసంచా విక్రయాలకు పాల్పడినా, తయారు చేసినా చర్యలు తీసుకుంటాం. టపాసులు కాల్చేటప్పుడు అందరూ జాగ్రత్తగా ఉండాలి. కాలుష్యం బారినపడకుండా చూసుకోవాలి.
–ఎస్.శేఖర్, తహసీల్దారు, గుమ్మలక్ష్మీపురం

పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం



సంతకాలు చేస్తున్న స్థానికులు

- వైఎస్సార్‌సీపీ నాయకులు

వీరఘట్టం: పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం చూస్తోందని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పిన్నింటి శ్రీనివాసరావు అన్నారు. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వీరఘట్టం రెల్లివీధి రోడ్డులో శుక్రవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సంతకాల సేకరణకు యువత నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తే.. కూటమి ప్రభుత్వం ఆయా రంగాలను నీరుగారుస్తోందని ఆరోపించారు. గత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తే ప్రస్తుత కూటమి సర్కారు వాటిని ప్రైవేట్‌పరం చేసేందుకు కుయుక్తులు పన్నుతోందన్నారు.

ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జలుమూరు అమర్‌నాథ్, బొమ్మాళి హేమలత, శంభాన శ్రీనివాసరావు, బండి రాజు, దేవుపల్లి ముద్దు, సనపతి చిన్న, తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై దాడి అమానుషం



పాలకొండ రూరల్: తహసీల్దార్ రాధాకృష్ణమూర్తికి వినతిపత్రం అందిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు



వీరఘట్టం: తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

పాలకొండ రూరల్: సుప్రీంకోర్టు న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి చేయడం అమానుషమని ఎంఆర్‌పీఎస్ నాయకులు అన్నారు. ఈ మేరకు నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ రాధాకృష్ణమూర్తికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్, ఎంఎంఎస్, వీహెచ్‌పీఎస్ అనుబంధ సంఘాల మన్యం జిల్లా అధ్యక్షుడు బోను మన్మధరరావు మాదిగ మాట్లాడుతూ.. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కళింగ ప్రేమభూషణరావు, నులకజోడు ప్రదీప్‌కుమార్, సారికి రమేష్, సంజీవి, సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిరసన..

వీరఘట్టం: భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై ఇటీవల జరిగిన దాడిని ఖండిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎంఆర్‌పీఎస్ నాయకులు నిరసన తెలిపారు. నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని కోరుతూ తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు బి.మన్మధ, కళింగ ప్రేమభూషణరావు, నత్తల కల్యాణ్, సైల రంజిత్, నత్తల రాహుల్, నులకజోడు బుజ్జి, నవిరి కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.



భామిని: తహసీల్దార్ శివన్నారాయణకు వినతి పత్రం అందజేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

శిక్షించాలి

భామిని: న్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేసిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి బోను మన్మధరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ శివన్నారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లోపింటి రాజేష్, టింగ హరిబాబు, చెప్పల కిశోర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు కళ్లు తెరిపిద్దాం..



సంతకాలు సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

- మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: నిరుపేదలకు నాణ్యమైన వైద్యం, వైద్య విద్య అందుబాటులోకి తీసుకొచ్చేందుకు వైఎస్సార్‌సీపీ హయాంలో ఏర్పాటు చేసిన 17 మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కళ్లు తెరిపిద్దామని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ మండలంలోని పాలమానుగూడలో శుక్రవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య కళాశాలలు ప్రైవేట్‌పరం అయితే ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుందని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో అసలు వైద్యమే అందదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, సర్పంచ్ వెంకునాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సారా తరలించినా, విక్రయించినా చర్యలు

పాలకొండ రూరల్: సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని ఎక్సైజ్ శాఖ సీఐ కె. సూర్యకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఇంతవరకు పట్టుబడిన 1429.5 లీటర్ల సారా, 230 మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..బెల్ట్‌షాపులు నిర్వహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆర్టీసీ డిపో ఆధునికీకరణ పనులు పరిశీలన

సాలూరు: పట్టణంలోని ఆర్టీసీ డిపోను ఆర్టీసీ విజయనగరం జోన్ ఈడీ బ్రహ్మానందరెడ్డి, చీఫ్ మెకానికల్ ఇంజినీర్ శ్రీనివాసరావులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపోలో సుమారు రూ.12 లక్షలతో జరుగుతున్న ఆధునికీకరణ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బస్సులు చాలని రూట్లకు అదనంగా బస్సులను ఏర్పాటుచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మూర్తి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యాసేవకు గుర్తింపు

పార్వతీపురం: విద్యారంగంలో చేసిన విశేష సేవలకు గాను పార్వతీపురంలోని శ్రీజన్ పాఠశాల కరెస్పాండెంట్ ఉప్పిలి శ్రీను ఉత్తమ కరెస్పాండెంట్ పురస్కారాన్ని ప్రపంచ విద్యార్థి దినోత్సవం సందర్భంగా అందుకున్నారు. ఈ మేరకు గజపతినగరంలో శుక్రవారం నిర్వహించిన బాలాజీ విద్యాసంస్థల శ్రీ సత్యసాయి దివ్యామృతం కార్యక్రమంలో భాగంగా ఉప్పిలి శ్రీనుకు అవార్డు అందజేశారు. దామోదరం సంజీవయ్య, జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డి. సూర్యప్రకాశరావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనువాసులునాయుడు, విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కరరెడ్డి చేతుల మీదుగా శ్రీనుకు పురస్కారం అందజేశారు.

ఘనంగా అన్నసమారాధన

సాలూరు: పట్టణంలోని వెలమపేట అక్కేనవీధి రామమందిరం వద్ద గౌరీశంకర మహోత్సవంలో భాగంగా శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలసంఖ్యలో భక్తులు తరలివచ్చి నందెమ్మ తీర్థప్రసాదాలను స్వీకరించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది.

కొత్తమ్మకు వెండి కిరీటం బహూకరణ

సాలూరు: పట్టణంలోని మెంటాడ వీధిలో కొలువైన కొత్తమ్మ తల్లికి మానేపల్లి ఈశ్వరరావు, కుటుంబసభ్యులు, బంధువులు వెండి కిరీటం శుక్రవారం వితరణగా ఇచ్చారు. సుమారు రూ.2 లక్షల 50 వేల విలువ చేసే కిరీటాన్ని అమ్మవారికి బహూకరించగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు శిక్షణ



శిక్షణ తరగతులకు హాజరైన సర్పంచ్‌లు

జియ్యమ్మవలస రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు శిక్షణ ఇస్తున్నారు. పంచాయతీల అభివృద్ధి, పారిశుధ్యం మెరుగుకు చేపట్టాల్సిన చర్యలు, పంచాయతీలకు అదనపు ఆదాయం అందించే మార్గాలపై ఇచ్చే ఈ శిక్షణకు శుక్రవారం ఎంపీడీవో కె.ధర్మారావు హాజరై, సర్పంచ్‌లకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షణకు పాటుపడాలని, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యానికి చర్యలు చేపట్టాలని, చెరువు గట్లు, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



సీతారాంపురంలో నిల్వ నీరు పారబోయిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

గరుగుబిల్లి: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మండలంలోని కొంకడివరం, సీతారాంపురం గ్రామాల్లో శుక్రవారం జరిగిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న ఆమె క్షేత్రస్థాయిలో వైద్యారోగ్య సిబ్బందితో కలిసి పర్యటించారు. ఖాళీ ప్రదేశాలు, డ్రమ్ముల్లోని నీటి నిల్వలను తొలగించారు. మన ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, చెత్తాచెదారం, మురికినీటి ప్రాంతాలు దోమలకు ఆవాసాలు అని, దోమల వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా జ్వరాలు ప్రబలుతాయని ఎంపీడీవో తెలిపారు. కాలువల్లోని పూడికలు తొలగించడంతో పాటు రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు.

తోటపల్లి ఆలయ ఈవోగా శ్రీనివాస్



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీకోదండరామస్వామి ఆలయాల ఈవోగా బి.శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వెలువడగా శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం శ్రీనివాస్ మక్కువ మండలంలోని శంబర పోలమాంబ ఆలయ ఈవోగా పనిచేస్తుండగా తోటపల్లి ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని, దైవదర్శనానికి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

డీడీ కార్యాలయం తరలింపునకు రంగం సిద్ధం



సీతంపేట ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయం

సీతంపేట: ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) కార్యాలయాన్ని శ్రీకాకుళం తరలించేందుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. ఈ మేరకు శ్రీకాకుళం కలెక్టరేట్ ప్రాంగణంలో ఒక ఆఫీస్‌ను కేటాయించినట్లు సమాచారం. కార్యాలయాన్ని పరిశీలించాలని ఉపసంచాలకుడు అన్నదొరకు వర్తమానం అందడంతో ఆయన పరిశీలనకు వెళ్లారు. డీడీ కార్యాలయాన్ని తరలించవద్దని.. సీతంపేటలోనే కొనసాగించాలని కోరుతూ పలు గిరిజన సంఘాలు, ప్రజాప్రతినిధులు కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 20 సబ్‌ప్లాన్ మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 47 ఆశ్రమ పాఠశాలలు, 18 పోస్టుమెట్రిక్ వసతిగృహాలున్నాయి. మొత్తం 12 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. సీతంపేట ఐటీడీఏ నుంచే పాఠశాలలు, వసతిగృహాలను పర్యవేక్షిస్తున్నారు. అయితే డీడీ కార్యాలయాన్ని శ్రీకాకుళం తరలిస్తే పర్యవేక్షణ కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉంటే శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోనే బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ కార్యాలయాలు ఉండడంతో గిరిజన సంక్షేమ కార్యాలయాన్ని కూడా అక్కడే నిర్వహించే విధంగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ విషయమై గిరిజన సంక్షేమ ఉపసంచాలకుడు అన్నదొర వద్ద ప్రస్తావించగా.. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యాలయాన్ని అక్కడ నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం



వంటలు పరిశీలిస్తున్న తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి

పాలకొండ రూరల్: విద్యార్థుల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి ఆదేశించారు. నగర పంచాయతీ పరిధి పెద్దకాపు వీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా బోధన, వసతి, భోజన సదుపాయాలపై ఆరా తీశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం నాగవంశపువీధిలో రేషన్ స్మార్ట్‌కార్డుల పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రైతులు

వీరఘట్టం: ఈ నెల 22న పార్వతీపురంలో జరగనున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ పదో మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ మండల శాఖ అధ్యక్షుడు ఎన్.సింహాచలం పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని కడకెల్ల గ్రామంలో రైతులతో కలిసి మహాసభల పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. మహాసభలకు రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి



మెటీరియల్ పంపిణీ చేస్తున్న వయోజన విద్య డైరెక్టర్ వైకుంఠరావు

సీతంపేట: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వయోజన విద్య డైరెక్టర్ వైకుంఠరావు మాట్లాడుతూ.. వయోజనులైన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. వలంటీర్లు ఉత్సాహంగా పని చేయాలన్నారు. అనంతరం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో 102 మంది వలంటీర్లు, ఎంపీడీఓ మిశ్రో, ఏపీఎం కమల, ఏపీఓ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

సింగన్నవలస వాసికి అరుదైన గౌరవం



నంది పురస్కారం అందుకుంటున్న భజన కళాకారుడు దుర్గాప్రసాద్

పాలకొండ: మండలంలోని సింగన్నవలస గ్రామానికి చెందిన భజన బృందం గాయకుడు బందారు వెంకటరామ దుర్గాప్రసాద్‌కు ఓ కళాకారుడిగా అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్‌కు చెందిన తెలుగు వెలుగు సాహితీ వేదిక శుక్రవారం చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో ఘనంగా సత్కరించి జాతీయ నంది పురస్కారాన్ని అందజేసింది. 50 ఏళ్లుగా భజన పాటలతో వేలాది దైవ కార్యక్రమాల్లో పాల్గొని భక్తులను పరవశింపజేసిన వెంకటరామ దుర్గాప్రసాద్ ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సుపరిచితుడు. తెలుగు వెలుగు రాష్ట్ర చైర్మన్ పి.రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, దైవజ్ఞ శర్మ తదితరులు ఈయనను ఘనంగా సత్కరించారు.